క్లుప్తంగా

చెరువులోకి చేపపిల్లల విడుదల



చేపపిల్లలు విడిచిపెడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని నందబలగ గ్రామంలో మెదురికృష్ణమ్మ చెరువులోకి చేపపిల్లలను శుక్రవారం విడుదల చేశారు. పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా మత్స్య సంపద వృద్ధి చేస్తూ ఎస్టీ మత్స్యకారులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా 60 శాతం రాయితీతో చేపపిల్లల పంపిణీ చేస్తున్నామని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో మొత్తం 10 చెరువుల్లో విడిచిపెట్టి, పెంచేందుకు 21,520 చేపపిల్లలు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పందిరి పంటల సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజాం: మండలంలోని గార్రాజుచీపురుపల్లి, సోపేరు, బొద్దాం, ఒమ్మి తదితర గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఒడిశా రాష్ట్ర రైతు బృందానికి పందిరి పంటల సాగుపై అవగాహన కల్పించారు. రాజాం ఉద్యానవన శాఖాధికారిణి ఉమామహేశ్వరి.. కూరగాయల సాగులో పండించే పందిరి పంటల గూర్చి రైతులకు వివరించారు.

రెండు పూటలా పనిచేయాలి



మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీవో హరనాథరావు

సంతకవిటి: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, రెండు పూటలా పనులు చేయాలని ఏపీవో ఆర్.హరనాథరావు సూచించారు. మండలంలోని గరికిపాడులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. రానున్న వేసవి ఎండల దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని, నిర్దేశితల కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన

రేగిడి: మండలంలోని గుళ్లపాడు గ్రామంలో జీవామృతం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఆవుపేడ, ఆవుమూత్రం వంటి వాటితో తయారు చేసిన జీవామృతాన్ని పంటలకు పిచికారీ చేస్తే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం పీఆర్పీ పి.రమాదేవి తెలిపారు. రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వాడితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు.

11 మంది దివ్యాంగుల గుర్తింపు

రేగిడి: దివ్యాంగుల గుర్తింపు సర్వేలో భాగంగా మండలంలోని అంబకండి గ్రామంలో వైద్యారోగ్య సిబ్బంది శుక్రవారం పర్యటించింది. వివిధ అంగవైకల్యంతో బాధపడుతున్న పలువురికి ఆరోగ్య తనిఖీలు చేశారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 11 మంది దివ్యాంగులను గుర్తించామన్నారు. వారందరికీ విజయనగరం ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తామన్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి

వంగర: మండలంలోని కొప్పర గ్రామంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఈవోపీఆర్‌డీ కోరారు. శుక్రవారం ఆ కేంద్రాన్ని సందర్శించి, 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి, కేంద్రాన్ని బాగు చేయాలని తెలిపారు.

సర్వేలపై సమీక్ష

రాజాం సిటీ: మండలంలోని సోపేరు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ఎంఎస్‌ఎంఈ, హౌస్‌హోల్డ్ జియో సర్వే, పీఏసీఎస్ ఈకేవైసీలపై సమీక్ష నిర్వహించారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావడంతో పాటు పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయాలని సూచించారు. షెుండింగ్‌లోని మిస్సింగ్ సిటిజన్ డేటా ఎంట్రీ వేగవంతం చేయాలన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

తెర్లాం: మండల కేంద్రంలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. మరమ్మతుకు గురైన బోర్లను సర్పంచ్ బోనెల రూప ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యుడు జి.ఆనందరావు దగ్గరుండి మెకానిక్‌తో బాగు చేయించారు. స్థానిక ఎస్సీ కాలనీలో రెండు బోర్లు మరమ్మతులకు గురికావడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న సర్పంచ్.. బోర్లను బాగు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

మాడిపోతున్న ఆశలు!

- మామిడి పూతపై మంచు ప్రభావం
- ఎక్కడికక్కడ ఎండిపోతున్న పువ్వు
- సస్యరక్షణ చేపట్టలేక రైతు దిగాలు
- పూత నిలిస్తేనే అధిక దిగుబడులు
- నియోజకవర్గంలో 2300 ఎకరాల్లో పంట





గార్రాజుచీపురుపల్లి సమీపంలో సరిగా పూతలేని మామిడితోట, (ఇన్‌సెట్‌లో) మంచు కారణంగా మాడిపోతున్న మామిడి పువ్వు

రాజాం: మామిడి పూతపై మంచుదెబ్బ పడుతోంది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు ఏకధాటిగా 12 గంటల పాటు విపరీతంగా కురుస్తున్న మంచుకు ఎక్కడికక్కడ మామిడి పూత ఎండిపోతోంది. కొన్నిచోట్ల పూత బాగున్నా మంచు కారణంగా అది పాడవుతుండడంతో దిగుబడులపై గంపెడాశలు పెట్టుకున్న రైతులు దిగాలుగా తలలు ఇప్పుడు పట్టుకుంటున్నారు. మంచు ప్రభావంతో ఏటా పంటనష్టం చవిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే ఉచితంగా తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఏడాదికి రూ.30 వేలు..

రాజాం నియోజకవర్గంలో వంగర, రాజాం మండలాల్లో మామిడితోటల సాగు అధికంగా ఉంది. నియోజకవర్గంలో మొత్తం 2300కు పైగా ఎకరాల్లో మామిడి సాగు జరుగుతుండగా, ఒక్క రాజాం మండలంలోనే 900 ఎకరాల్లో మామిడి పంట సాగులో ఉంది. ఫిబ్రవరి నుంచి మే నెల వరకు మామిడి తోటల కాపలా కౌలురైతులు ఉంటారు. మూడేళ్లకు లేదా ఏడాదికి గాను తోటలను రైతుల నుంచి కౌలురైతులు తీసుకుని, తోట విస్తీర్ణం, అందులోని చెట్ల సంఖ్య ఆధారంగా ఏడాదికి రూ.30 వేలు ఆపైబడి సొమ్మును రైతులకు కౌలురైతులు చెల్లిస్తారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఏటా 800 మందికి పైగా కౌలురైతు కుటుంబాలు మామిడితోటల కాపలా కాస్తూ జీవనం సాగిస్తున్నారు.

ఎకరాకు 4 టన్నుల దిగుబడి..

ఎకరా తోటలో 4 టన్నుల వరకు దిగుబడి రావాలి. ఇందులో బంగినపల్లి, రసాలు వంటి మంచి జాతి పండ్లు ఉంటేనే మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉంటుంది. ఏప్రిల్ నాటికి కాయ (పలకబారితే)ముదిరితేనే రైతుకు మద్దతు ధర వస్తుంది. గతేడాది ఏప్రిల్, మే నెలల్లో టన్ను మామిడికాయల ధర రూ.14 వేల వరకు పలికింది. ఈ ఏడాది కూడా మామిడి రైతుకు అనుకూలంగా ఉంటుందని అంతా ఊహించారు. ప్రస్తుతం పంటను మంచు ముంచేస్తుండడం, తెగుళ్ల సోకడం, పూత మాడిపోవడం, పిందె ఆశించిన పరిణామంలో కనిపించకపోవడం వంటివి రైతును ఆందోళనలోకి నెట్టింది.

రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లోని మామిడి రైతులను ఉద్యానవన శాఖాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కలిప్తున్నారు. మామిడి పూత నిలబడాలంటే ఈ విధంగా చేస్తే ప్రయోజనం ఉంటుందని ఉద్యానవన శాఖాధికారి ఉమామహేశ్వరి చెబుతున్నారు.

పూత నిలబడాలంటే ఇలా చేయండి..

ప్రస్తుతం మొగ్గ దశలోని మామిడి పంటను ఆశించిన చీడపీడల నివారణకు నీటిలో కరిగే గంధకం 2 గ్రాములు, ఎసిఫేట్ 1 గ్రాము, మల్టీకే 10 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే పూత నిలబడుతుందని తెలిపారు. పూత విచ్చుకోకముందు, తర్వాత దశల్లో పురుగు, తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉంటుందని, తెగుళ్ల తీవ్రత ఆధారంగా హెక్సాకోనోజోల్ రెండు మిల్లీలీటర్లు, దయామిదాక్సిన్‌తో కలిపి పురుగుమందును, తామరపురుగు, కాయమీద గోకినట్లుగా కనిపిస్తే ఫ్రిస్తోనిల్ 2 మిల్లీలీటర్లు గానీ, ఫెప్రోనిక్‌తో పాటు ఇమిడాక్లోప్రిడ్ కాంబినేషన్‌తో ఉన్న పురుగుమందును తగిన మోతాదులో పుష్పగుచ్ఛాలపై స్ప్రే చేయాలన్నారు.

పరామర్శ



సర్పంచ్ బాగోగులు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం సర్పంచ్ కెంబూరీ తేజోవేంకటేశ్వరరావును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు శుక్రవారం కలిసి పరామర్శించారు. ఇటీవల సదరు సర్పంచ్‌కు శస్త్ర చికిత్స జరగ్గా, ఆపరేషన్ అనంతరం ఆయన ఇంటి వద్దనే కోలుకుంటున్న విషయం తెలుసుకున్న వారు లక్ష్మీపురం వెళ్లి ఆయన ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, ఎంపీటీసీ ఎర్నేన అప్పలనాయుడు, పార్టీ రాజాం నియోజకవర్గం బీసీ సెల్ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, వన్నలి సర్పంచ్ గార రమణ, సంకిలి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెంబూరీ గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

రోజుకు 8 గంటలు పనిచేయాలి



రేగిడి: వేతనదారులకు సూచనలిస్తున్న డ్వామా పీడీ శారదాదేవి

రేగిడి: ఉపాధి హామీ పథకం పనుల్లో నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందని డ్వామా పీడీ ఎస్.శారదాదేవి తెలిపారు. మండలంలోని బూరాడ గ్రామంలో బత్తిలివాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. రోజులో ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు పని చేయాలని, అప్పుడే గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో హరనాథరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని గొల్లాది గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో ఎస్.రామకృష్ణ శుక్రవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉండేలా చూడాలని సిబ్బందికి ఎంపీడీవో తెలిపారు.

కార్యాలయ భూముల చుట్టూ ప్రహరీ నిర్మిస్తాం

సాక్షి ఎఫెక్ట్

రాజాం: స్థానిక అమ్మవారి కాలనీ వద్ద గొర్లె శ్రీరాములునాయుడు మడ్డువలస రిజర్వాయరు ప్రాజెక్టు క్యాంపు కార్యాలయాల భూముల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడతామని ప్రాజెక్టు డీఈఈ పి.నాగేశ్వరరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. అవే భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు ఇటీవల సాక్షి దినపత్రికలో కబ్జా కోరల్లో.. కార్యాలయ భూములు అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. ఈ మేరకు ఆయన స్పందించి, భూములు ఆక్రమణకు గురికాలేదని, ఎందుకైనా మంచిది రాజాం తహసీల్దారు ఎస్‌కే రాజుతో ఒకసారి సర్వే చేయిస్తామన్నారు. తాత్కాలికంగా పలుచోట్ల భూములు వినియోగిస్తున్న వారికి నోటీసులు కూడా ఇచ్చామన్నారు. ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులను కోరామన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న సత్యసాయి బాబా భక్తులు

రేగిడి: వైద్య తనిఖీల నిమిత్తం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విచ్చేసిన గర్భిణులకు సత్యసాయిబాబా భక్తులు శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. గర్భిణుల మెరుగైన ఆరోగ్యమే లక్ష్యంగా ప్రతినెలా అన్నదానం చేస్తున్నామని భక్తులు తెలిపారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

రాజాం సిటీ: జాతీయ లోక్ అదాలత్ మార్చి 8వ తేదీన నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులతో శుక్రవారం సమావేశమైన ఆమె.. రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులన్నీ పరిష్కరించనున్నామన్నారు. న్యాయవాదులు లోక్‌అదాలత్‌కు సహకరించి వీలైనన్ని కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపసు ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌పీబీ కృష్ణసాయితేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రామినాయుడు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు దామోదరం సంజీవయ్య

బాడంగి: మండలంలోని పింద్రంగివలస పాఠశాలలో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి శుక్రవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రవిబాబు, సిబ్బంది, విద్యార్థులంతా సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఆదర్శప్రాయుడు సంజీవయ్య అని, నిజాయితీగా, నిరాడంబరంగా అత్యంత సాధారణ జీవితం గడిపిన మహానుబావుడన్నారు. రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రిగా పేరొందారన్నారు.

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ



బొబ్బిలిరూరల్: పారాది అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న పీడీ రుక్సానా బేగం

రేగిడి: మండలంలోని బూరాడ, ఉంగరాడ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ బూరాడ సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత శుక్రవారం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని, సమయానికి విధులకు హాజరుకావాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందజేయాలన్నారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది, మెట్టవలస అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా బేగం శుక్రవారం సందర్శించి, చిన్నారు లు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి

తెర్లాం: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవోలు త్రినాధరావు, పాపారావు సూచించారు. మండలంలోని నెమలాం ప్రాథమిక పాఠశాలను వారు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హోం వర్కు పుస్తకాలు, చేతిరాత, ఉపాధ్యాయుల లెస్సన్ ప్లానింగ్, డైరీలను పరిశీలించారు. అలాగే మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకం వంటకాలు, తాగునీటి వనరుల వినియోగాన్ని చూసి, పలు సూచనలు చేశారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాడంగి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి, ఇంటర్మీడియట్(ఇంగ్లిష్ మీడియం)లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నారాయణరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. మార్చి 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని, ఆన్‌లైన్‌లో గానీ నేరుగా గురుకులానికి వచ్చి గానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

హైకోర్టు తీర్పు అమలు చేయండి



ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోనెల ప్రసాదరావు ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయమై ఆయన రాజాంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. సర్పంచ్ అధికారాలను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. సర్పంచ్ తీర్మానం లేకుండా కూటమి నాయకుల ఇష్టానుసారంగా ఉపాధి పనులు చేపట్టడం జరుగుతోందని, ఇదే విషయంలో పలువురు కోర్టును ఆశ్రయిస్తే ఎన్ఆర్ఈజీఎస్ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. ఈ మేరకు కలెక్టరు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన



బొబ్బిలిలోని పాకి వీధిలో పారిశుధ్య కార్మికులు ఆందోళనకు దిగారు. గతంలో తమకు కేటాయించిన ఇళ్లస్థలాలను మురుగునీటి శుద్ధి ప్లాంట్‌కు ఏ విధంగా కేటాయిస్తారని అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం ఉదయం పారిశుధ్య కార్మికులకు కేటాయించిన స్థలాల్లో వారు వేసుకున్న చిన్నచిన్న పాకలను కూల్చివేసేందుకు అధికారులు, పోలీసులు జేసీబీలతో చేరుకున్నారు. పాకల తొలగింపును కార్మికులు అడ్డుకుని, అధికారుల తీరుపై మండిపడ్డారు. ఏమీ చేయలేక ఇది ప్రభుత్వ స్థలం.. ఆక్రమణదారులు శిక్షార్హులని అధికారులు అక్కడ బోర్డు పెట్టేసి వెనుదిరిగారు. -బొబ్బిలి

రెయిలింగ్ ఏర్పాటు చేయరూ?



సంతకవిటి-చిత్తారపురం ప్రధాన రహదారిలో వాసుదేవపట్నం వద్ద సాయన్న చానల్ వంతెన ప్రమాదకరంగా కనిపిస్తోంది. బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ గోడ కానీ రెయిలింగ్ కానీ లేకపోవడంతో అటువైపుగా రాకపోకలు సాగించే వాహనాలు అదుపు తప్పితే పరిస్థితి ఏంటని అంతా భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రెయిలింగ్ నిర్మించకుంటే వంతెన పైనుంచి గెడ్డలోకి వాహనాలు దూసుకెళ్లాల్సిందేనని అంటున్నారు. ఇదే వంతెనపై టెలికాం శాఖ అధికారులు పైపులు వేసి వాటి చుట్టూ కాంక్రీట్ వేయడంతో బ్రిడ్జి రోడ్డు విస్తీర్ణం కూడా తగ్గిందని, ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తుందోనని అటువైపుగా వెళ్లేవారంతా భయపడుతున్నారు. - సంతకవిటి

క్షయవ్యాధి నిర్మూలనకు చర్యలు



ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

వంగర: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారిణి సీహెచ్ జ్యోతి తెలిపారు. మండలంలోని మద్దివలస గ్రామంలో క్షయవ్యాధి నిర్మూలనపై శుక్రవారం అవగాహన కల్పించారు. వ్యాధి నిర్మూలనకు సమష్టిగా బాధ్యత వహించాలంటూ గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోంది..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్రంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం హయాంలో అరాచక పాలన నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. ఇదే విషయమై స్థానిక విలేకరులతో శుక్రవారం మాట్లాడిన ఆయన.. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్ట్ అక్రమమని ఖండించారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఆయనను అరెస్ట్ చేశారన్నారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ప్రతిపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలపై దాడులకు ఎగబడడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని, చేసిన నేరాలు, ఘోరాలతో సంబంధం లేకుండా అరెస్ట్‌లు జరుగుతున్నాయన్నారు. సీఎం చంద్రబాబు ఒత్తిడితోనే హోం శాఖ పనిచేస్తోందని విమర్శించారు. ప్రజలకు చెప్పి మరీ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ రాష్ట్రంలో రక్తపాతం సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలంతా గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో వారే సరైన సమయం చూసి బుద్ధి చెబుతారన్నారు. ఆయన వెంట జేసీఎస్ మండల ఇన్‌చార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, నాయకులు అల్లు త్రినాధరావు, కోట గోవిందరావు తదితరులు ఉన్నారు.